www.nagaranijam.com PRGI/RNI NO: APTEL/2013/54450




# నగరనిజం


www.nagaranijam.com అక్షరనిజం నగరనిజం తెలుగు దిన పత్రిక

NNTV TELANGANA నగర నిజం

| సంపుటి : 14 | సంచిక :12 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 5 ఆదివారం, ఏప్రిల్ 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 12 | Rangareddy | Editor : Yela.Purushotham | 5 Sunday , APRIL 2026 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

# ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠం బీఆర్ఎస్ కైవసం



- ఏకగ్రీవంగా చైర్మన్‌గా టేకుల సుదర్శన్ రెడ్డి ఎన్నిక
- వైస్ చైర్మన్‌గా బీజేపీ అభ్యర్థి ముత్యాల శ్యామల భాస్కర్
- ముందుగానే ఓటమిని అంగీకరించిన కాంగ్రెస్ కౌన్సిలర్లు
- ఎన్నిక ప్రారంభం కాగానే వాయిదా వేయాలని పట్టు
- ఆ వెంటనే ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో సహా వాకౌట్
- మెజార్టీ సభ్యుల ఓటింగ్ తో

**చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పూర్తి**



ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్‌గా టేకుల సుదర్శన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ముత్యాల శ్యామల

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 ( నగరనిజం ) : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో నెలకొన్న రాజకీయ ఉత్కంఠకు తెరపడింది. సుమారు 50 రోజుల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం మున్సిపల్ చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన టేకుల సుదర్శన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజకీయ పరిణామాలు, విభిన్న ప్రయత్నాలు మధ్య చివరకు బీఆర్ఎస్ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఐక్యంగా నిలిచి అధికార పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యే చేపట్టిన వ్యూహాలను సమర్థంగా ఎదుర్కొన్నట్లు సమాచారం. బలమైన సంఖ్యాబలం ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి బీఆర్ఎస్ వైస్ చైర్మన్ పదవిని బీజేపీకి కేటాయించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ మేరకు బీజేపీకి చెందిన ముత్యాల శ్యామల వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇక కాంగ్రెస్ వైపు నుంచి జరిగిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఓటమి అనంతరం కూడా వివిధ మార్గాల్లో ప్రయత్నాలు చేయడం పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముందుగానే పరిస్థితిని అర్థం చేసుకుని వెనక్కి తగ్గి ఉంటే కొంత గౌరవం నిలిచేది అనే వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మరోవైపు, బీఆర్ఎస్ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు ఈ ఫలితాన్ని స్వాగతిస్తూ సంబరాలు జరుపుకున్నారు. అధికార అహంకారానికి తగిన గుణపాఠం జరిగిందని బీఆర్ఎస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ రాజకీయాల్లో బీఆర్ఎస్ ఆధిపత్యం మరొకసారి స్పష్టమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ధర్మమే గెలిచింది, పట్నం తలెత్తుకుని నిలిచిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా చివరకు తాము నిబద్ధత కలిగిన కౌన్సిలర్లతో మున్సిపాలిటీ కైవసం చేసుకోగలిగామని చెప్పారు.

### ఓటమిని అంగీకరించి కాంగ్రెస్ వాకౌట్..

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగానే కాంగ్రెస్ కౌన్సిలర్లు ముందుగానే ఓటమిని అంగీకరించినట్టుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. సమావేశం ప్రారంభమైన వెంటనే ఎన్నికను వాయిదా వేయాలని పట్టుబట్టారు. అయితే ఆ డిమాండ్‌కు స్పందన లభించకపోవడంతో ఎక్స్ అఫీషియో హోదాలో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహా ఆ పార్టీ నుండి గెలుపొందిన 8 మంది కౌన్సిలర్ లు, బీఆర్ఎస్ అసంతృప్తి కౌన్సిలర్ ఆకుల యాదగిరి, బీజేపీ కౌన్సిలర్ సిద్ధం భానుప్రియ లు వాకౌట్ చేశారు. దీంతో మిగిలిన సభ్యులతో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. మెజార్టీ సభ్యుల ఓటింగ్ ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు పూర్తి చేశారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫలితాలను అధికారికంగా ప్రకటించి ఎన్నిక ధ్రువపత్రాలను అందజేశారు. దీంతో ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

# ' పట్నం ' మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన టేకుల సుదర్శన్ రెడ్డి

**బీఆర్ఎస్ నేతల అభినందనల వెల్లువ - బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం**

- ప్రమాణ స్వీకారానికి హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి
- అభినందనలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, ప్రశాంత్ కుమార్ రెడ్డి



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 ( నగరనిజం ) : ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన టేకుల సుదర్శన్ రెడ్డి పదవీ బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో హర్షాతిరేక వాతావరణం నెలకొంది. పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తమ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కూడా పాల్గొన్నారు. వైస్ చైర్మన్‌గా ఎన్నికైన ముత్యాల శ్యామలతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని చైర్మన్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టేకుల సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ప్రజల ఆశలు నెరవేర్చడం తన ప్రధాన లక్ష్యమని, అన్ని వర్గాల సహకారంతో ఇబ్రహీంపట్నం అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తానని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో



చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకోవడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం వెల్లివిరిసింది. పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలు నిర్వహించి, పటాకులు పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ విజయం నిబద్ధతతో పనిచేసిన పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అంకితమని పేర్కొన్నారు. ఎన్నో రాజకీయ పరిణామాలు, వ్యూహాలు, ఒత్తిళ్లు ఎదురైనా చివరకు పార్టీ ఐక్యత, నాయకత్వంపై విశ్వాసం విజయం సాధించిందని అన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా చివరికి బీఆర్ఎస్ మున్సిపాలిటీని కైవసం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



## శంషాబాద్‌లో ఆక్రమణలపై జీహెచ్ఎంసీ అధికారుల ఉక్కుపాదం

మిగతాది 2లో

# జర్నలిస్టుల పట్ల పాలకుల వివక్ష

- పోరాటం లేనిదే సమస్యలు పరిష్కారం కావు

**టీడబ్ల్యూజేఎఫ్ ( హెచ్-2843) వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య**





**ఖమ్మం:(నగర నిజం బ్యూరో) ఏప్రిల్ 4:** ఖమ్మం:-జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం,పాలకులు చూపుతున్న వివక్ష,నిర్లక్ష్య వైఖరిని విడనాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టిడబ్ల్యుజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి పని చేస్తున్న పాత్రికేయులు తమ సమస్యలపై రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల గడిచినా, ఇంతవరకు జర్నలిస్టులకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని ఆయన ధ్వజమెత్తారు. అక్రెడిటేషన్ కార్డుల్లో కోత లేకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రెడిటేషన్లు ఇవ్వాలని, అదేవిధంగా ప్రభుత్వం జర్నలిస్టుల కోసం ప్రకటించిన మ్యానిఫెస్టో అంశాలను అమలు చేయాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పట్ల గతంలో ఎన్నడూ లేని వివక్ష కొనసాగుతుందని, అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను గందరగోళం చేసి జర్నలిస్టులను ఆందోళన వైపుకు నెట్టారని అన్నారు. ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఆందోళనను ఉధృతం చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో చాలా ఏళ్ళుగా పెండింగ్ లో ఉన్న ఇళ్ళస్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో టీడబ్ల్యూజేఎఫ్ ( హెచ్-2843) నాయకులు జర్నలిస్టుల సమస్యల, సంక్షేమం వైపు దృష్టి సారించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ (హెచ్-2843) హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి నగేష్,లీగల్ అడ్వయిజర్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో ఈ రోజున కొత్త కమిటీ ఎన్నికఖమ్మం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికతెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీ.డబ్ల్యూ.జే.ఎఫ్) ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షుడుగా నానబాల రామకృష్ణ,ప్రధాన కార్యదర్శి గా అర్వపల్లి నగేష్, కోశాధికారి గా వేములకొండ రమేష్ కుమార్ లను తో పాటు పూర్తి స్థాయి కమిటీ ఎన్నిక జరిగింది. ఈ జనరల్ బాడీ సమావేశంలో జిల్లా టి.బి.జే.ఎ అధ్యక్షుడిగా వందనపు సామ్రాట్ గుప్తా, కార్యదర్శి కాసోజుశ్రీధర్ , టీబీజేఏ ఖమ్మం నగర అధ్యక్షుడు వెలుగోటి వెంకట్ కార్యదర్శి నల్ల రాకేష్ రెడ్డిటిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం నగర అధ్యక్షుడు గంటేల కుమార్ కార్యదర్శి కప్పల మధుఖమ్మం ప్రెస్ క్లబ్అధ్యక్షుడు ఆన్తోటి శ్రీనివాస్ కార్యదర్శి మల్లెల శిల్ప ఫోటోగ్రాఫర్ అధ్యక్షుడుఅమరబోయిన ఉపేందర్ కార్యదర్శి చెరుకుమల్లి సతీష్ ,మరియు జిల్లా సంయుక్త కార్యదర్శి కుంభం రవికుమార్, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, నాగకృష్ణ, ఈసీ మెంబర్స్మామిడాల వీరబాబు, మహమ్మద్ షకిల్ పాషా, లింగాల రామ్మూర్తి, ఓరుగంటి కిరణ్, ఎలిశెట్టి రామకృష్ణ బాబు, కల్లేపల్లి లింగయ్య, స్వాతి, శివ, జగదీష్‌గౌరవ ప్రధాన సలహాదారుడు కొదుమూరి జగన్నాధ రావు తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో ఆక్రమణలపై జీహెచ్ఎంసీ అధికారుల ఉక్కు పాదం





- **శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ వరకు రోడ్డు ఫుట్ పాత్ స్థలాల ఆక్రమణలపై కొరడా ఝులిపించిన అధికారులు**
- **భారీగా పోలీసు బలగాలను మొహరించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు**
- **శంషాబాద్ - షాబాద్ రోడ్డు విస్తరణకు తొలగిన అడ్డంకులు**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 4 (నగరనిజం ప్రతినిధి):** గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ స్థలాలను ఆక్రమించుకొని చేపట్టిన పలు అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కు పాదం మోపారు. ఈ మేరకు శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ, డిప్యూటీ కమీషనర్ సుమన్ రావు నేతృత్వంలో "రైట్ టు వాక్" అనే నినాదంతో శనివారం తెల్లవారుజామున ఐదు గంటల నుండి రంగంలోకి దిగిన అధికారుల బృందం.... దాదాపు 10 జేసీబీలతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. పలువురు వ్యాపారస్తులు కూల్చివేతలను అడ్డుకోవడానికి ప్రయత్నించినప్పటికీ.....అధికారులు తమ పని కానిచ్చేశారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ మీదుగా షాబాద్ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 100 ఫీట్ల వెడల్పుతో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రోడ్డు విస్తరణకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ అడుగడుగునా రోడ్డు, ఫుట్పాత్ స్థలాల ఆక్రమణ కారణంగా విస్తరణ పనులు ఒక అడుగు ముందుకు... రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా కొనసాగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలోని రోడ్డు, ఫుట్ పాత్ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. దీంతో శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ, డిప్యూటీ కమీషనర్ సుమన్ రావు ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ అధికార యంత్రాంగం.... భారీగా పోలీసు బలగాలను మోహరించి ఆక్రమణలపై చర్యలు చేపట్టారు. శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ వరకు రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన అక్రమ నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేశారు. దీంతో కూల్చివేతలను అడ్డుకోవడానికి ప్రయత్నించిన పలువురు స్థానికులు.... అధికారులతో వాగ్వాదానికి దిగారు. రోడ్డు పక్కన స్థలాలు తమ పూర్వీకులవని వాదిస్తూ కూల్చివేతలను అడ్డుకోవడానికి విఫల యత్నం చేశారు. అయితే ఫుట్ పాత్ స్థలాల ఆక్రమణలు, రోడ్డు స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన నేపథ్యంలో కూల్చివేతల విషయంలో అధికారులు వెనక్కి తగ్గలేదు. రోడ్డుపక్కన చేపట్టిన తాత్కాలిక దుకాణాలతో పాటు ర్యాంపులు, మెట్లను కూల్చివేశారు.

### ఆక్రమణలకు ఊతమిస్తున్న కరెంటు స్తంభాలు.... హరితహారం మొక్కలు


శంషాబాద్ లో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు, హరితహారం మొక్కలు ఆక్రమణదారులకు వరంగా మారుతున్నాయి. రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభాలు, హరితహారం మొక్కలు ఉండడంతో వాటిని అడ్డుపెట్టుకొని చాలామంది రోడ్డు ఫుట్ స్థలాల ఆక్రమణకు పాల్పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు విద్యుత్తు స్తంభాలు, హరితహారం మొక్కలను తొలగిస్తే తప్ప తమ జోలికి రారనే విశ్వాసంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.







## కాంగ్రెస్ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షునిగా పోలేపల్లి నరసింహ నియామకం



**వలిగొండ, ఏప్రిల్ 4 ( నగర నిజం):** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలన్న గారి సూచన మేరకు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల ప్రకారం జిల్లా కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షునిగా పోలేపల్లి నరసింహ గారిని నియమించినట్లు వెల్లడించారు.

వలిగొండ మండలం సుంకిశాల గ్రామానికి చెందిన పోలేపల్లి నరసింహ గారు కళారంగంలో విశేష అనుభవం కలిగి ఉండడంతో ఈ బాధ్యతలు అప్పగించి నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆయన నాయకత్వంలో జిల్లా వ్యాప్తంగా సాంస్కృతిక కార్యక్రమాలు మరింత చైతన్యవంతంగా ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు గారు మాట్లాడుతూ, జిల్లా కళాకారులందరూ ఐక్యంగా పనిచేసి పోలేపల్లి నరసింహ గారికి పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ కార్యాచరణను సమగ్రంగా రూపొందించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోలేపల్లి నరసింహ గారికి అభినందనలు తెలుపుతూ, ఆయన విజయవంతమైన పదవీకాలం కోసం శు భాకాంక్షలు తెలియజేశారు.

## పోచమ్మతల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం..


- **ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**



**ఎల్బీనగర్, ఏప్రిల్ 4 (నగర నిజం):** చంపాపేట డివిజన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీలో ఉన్న శ్రీశ్రీశ్రీ పోచమ్మతల్లి దేవాలయంలో ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంపాపేట డివిజన్ సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు చీర శ్రీనివాస్ ఆహ్వానం మేరకు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

- **మహేశ్వరం విద్యుత్ అధికారి, ఏఈ చక్రపాణి**



**మహేశ్వరం ఎప్రిల్ 04 (నగరనిజం)** :నేడు (ఆదివారం) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మహేశ్వరం విద్యుత్ అధికారి ఏ ఈ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. మహేశ్వరం సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు మహేశ్వరం పట్టణం, సిరిగిరిపురం, తుమ్మలూరు, కావలోని భాయ్ తండా, కొత్వాల్ చెరువు తండా, గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంస్థకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


## అభివృద్ధి పనుల్లో ఎక్కడా వెనుకడుగు లేదు : బండి రమేష్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 4 (నగర నిజం ప్రతినిధి):** నియోజకవర్గ అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా పడబోమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ స్పష్టం చేశారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ను కలిసి అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఇప్పటికే ప్రారంభమై కొనసాగుతున్న పనులతో పాటు పలు ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని రమేష్ కోరారు. ముఖ్యంగా జేఎన్టీయూ చౌరస్తా వద్ద స్కైవాక్ నిర్మాణం, మూసాపేట వై జంక్షన్ వద్ద అండర్‌పాస్ పనులు, సర్దార్ నగర్‌లో హిందూ స్మశాన వాటిక ప్రారంభోత్సవం, అలాగే రాజు కాలనీలోని స్థలాన్ని కమ్యూనిటీ హాల్‌కు కేటాయింపు వంటి అంశాలను ఆయన ప్రాధాన్యతగా ప్రస్తావించారు. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఇప్పటికే అనుమతులు పొందిన మరియు ప్రారంభించాల్సిన పనులను త్వరలోనే మొదలు పెడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రాంతీయ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## కేసీఆర్ క్యాంప్ కార్యాలయం పై దాడికి పాల్పడ్డ దోషులను తక్షణమే అరెస్టు చేయాలి

- **గులాబీ రాష్ట్ర నేత మంచర్ల శ్రీనివాస్**
- **గజ్వేల్ లోని కేసీఆర్ క్యాంపు కార్యాలయం పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన శ్రీనివాస్**
- **ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని ఆరోపణ**



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 4 (నగరనిజం ప్రతినిధి):** గజ్వేల్ లోని కేసీఆర్ అధికారిక క్యాంపు కార్యాల యం పై దాడికి పాల్పడ్డ దోషులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నేత, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మంచర్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ గూండాలు కేసీఆర్ క్యాంప్ కార్యాలయం పై దాడికి పాల్పడ్డా రని శ్రీనివాస్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నేతగానే కాకుండా రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించారని శ్రీనివాస్ గుర్తు చేశా రు. అయితే శనివారం నాడు రంగారెడ్డి జిల్లాలో ని ఇబ్రహీంపట్నం తో పాటు క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ గూండాలు గజ్వేల్ లోని కేసీఆర్ క్యాంపు కార్యాలయం పై దాడికి పాల్ప డ్డారని ఆయన ఆరోపించారు. కార్యాలయం దాడికి పాల్పడి ఫర్నిచర్ ను వం ధ్వంసం చేయడంతో పాటు సీఎం రేవంత్ రెడ్డి ఫోటోలు బలవంతంగా అంటించడం దారుణమని మంచర్ల శ్రీనివాస్ మండిపడ్డారు. రాష్ట్రానికి మంచి చేసి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించాలి తప్ప ఇలా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రతిపక్ష నేత అధికారిక క్యాంపు కార్యాలయాలపై దాడులకు దిగడం సమంజసం కాదన్నారు. కేవలం ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకని అధికార పార్టీ కార్యకర్తలు అసహనంతో ఇలాంటి దాడులకు పాల్పడ్డారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ షాపు కార్యాలయం పై దాడికి పాల్పడ్డ దోషులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నేత మంచర్ల శ్రీనివాస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని శ్రీనివాస్ తీవ్రంగా హెచ్చరించారు.

# అందుబాటులోకి అత్యవసర వైద్య సేవలు..



- **మెడిసిటీ ఆసుపత్రిలో అత్యాధునిక ఐసీయూ ప్రారంభం**
- **ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల కోసం ప్రత్యేక సదుపాయాలు**
- **20 పడకలు, ఆధునిక వెంటిలేటర్లు, డయాలసిస్ యూనిట్లతో ఏర్పాటు**
- **సామాన్యులకు సైతం అందుబాటు ధరలోనే కార్పొరేట్ స్థాయి వైద్యం**





మేడ్చల్ ఏప్రిల్ 4(నగర నిజం)ఎల్లంపేట్ మున్సిపల్,అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు మెరుగైన, సత్వర వైద్యం అందించే లక్ష్యంతో ఘన్‌పూర్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అనుబంధ 'మెడిసిటీ ఆసుపత్రి'లో అత్యాధునిక ఇంటెన్సివ్ కేర్ యూనిట్ అందుబాటులోకి వచ్చింది. శనివారం ఉదయం ఆసుపత్రి ప్రాంగణంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, మెడిసిటీ హాస్పిటల్స్ సీఈఓ ఐనిష్ మర్చంట్ రిబ్బన్ కట్ చేసి ఈ నూతన ఐసీయూని ప్రారంభించారు.

### కార్పొరేట్ స్థాయి సదుపాయాలు..

కొత్తగా ప్రారంభించిన ఈ ఐసీయూలో ఒకేసారి 20 మందికి అత్యవసర చికిత్స అందించేలా పడకలను ఏర్పాటు చేశారు. మారుతున్న వైద్య అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక వైద్య పరికరాలు, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణవాయువు అందించే హై-ఎండ్ వెంటిలేటర్లు, అలాగే కిడ్నీ సంబంధిత అత్యవసరాల కోసం ప్రత్యేక డయాలసిస్ యూనిట్లను సైతం ఈ ఐసీయూలో పొందుపరిచారు. నిపుణులైన వైద్య బృందం, శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది 24 గంటల పాటు ఇక్కడ పర్యవేక్షణలో ఉంటారు.

### అందుబాటు ధరలోనే మెరుగైన వైద్యం..

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె. శివరామకృష్ణ మాట్లాడుతూ.. "ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటు ధరలలో అందించాలన్నదే మెడిసిటీ ఆసుపత్రి ప్రధాన లక్ష్యం. అందులో భాగంగానే నేడు ఈ హైటెక్ ఐసీయూను ప్రారంభించాం. రాబోయే రోజుల్లో రోగుల సౌకర్యార్థం మరిన్ని ఆధునిక వైద్య వ్యవస్థలను తీసుకువస్తాం" అని వెల్లడించారు. అనంతరం మెడిసిటీ హాస్పిటల్స్ సీఈఓ ఐనిష్ మర్చంట్ మాట్లాడుతూ.. ప్రమాదాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగుల ప్రాణాలను నిలబెట్టేందుకు అవసరమైన అన్ని రకాల లైఫ్-సేవింగ్ సదుపాయాలను ఈ ఐసీయూలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ ఆసుపత్రి మెడికల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ సి. గీత, మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేంద్ర సింగ్ నేగి, ఇతర సీనియర్ వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరనిజం

5 ఆదివారం, ఏప్రిల్ 2026

## కాంగ్రెస్ నాయకుడు సంజీవరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 4 (నగర నిజం ప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీ నాయకుడు సంజీవరావు జన్మదిన వేడుకలు శనివారం కూకట్పల్లి ప్రకాష్ నగర్‌లోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ సంజీవరావుకు శాలువా కప్పి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యక్రమానికి హాజరైన వారందరికీ పంచిపెట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి నాయకుడు కష్టపడి పని చేయాలని బండి రమేష్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.వేడుకల ముగింపులో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు సంజీవరావుకు శుభాకాంక్షలు తెలుపుతూ కార్యక్రమాన్ని ఆనందంగా ముగించారు.

## కళాకారులకు సత్కారం ఉత్తమ సంస్కృతి

- **టి.వి.స్వామి**




**హైద్రాబాద్ ఏప్రిల్ 4;** ప్రతిభ గల కళాకారుల వల్లనే సమాజంలో సంస్కృతీ సాంప్రదాయాలు విలసిల్లుతున్నాయని కళాకారులు జాతికి వరమని ప్రముఖ రచయిత టి.వి.స్వామి అన్నారు.శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్, జి.యస్.ఆర్. �ు ఫ్రెండ్స్ ఈవెంట్స్ సంయుక్తాధ్వర్యంలో వివిధ రంగాల ప్రముఖులకు ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం కళామారుతి వేదికలో గురువారం ఘనంగా జరిగింది. ప్రముఖ విద్యావేత్త డా॥ లలితావాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత టి.వి.స్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి వివిధ రంగాలలో ప్రతిభావంతు లయిన వారికి శ్రీ పరాభవ నామ సం॥ర ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. డా॥ నర్మదారెడ్డి, (ప్రపంచ పర్యాటకురాలు), సద్గురు దామోదరాచార్య (జ్యోతిషం), యెల్లేష్ (రేడియో జీకే, మిమిక్రీ ఆర్టిస్ట్), రాజ్ మురారి (దర్శకులు), కావ్య సుధ (ప్రముఖ రచయిత) పురస్కారాలు అందుకున్నారు. ఆత్మీ అతిథిగా డా॥ పద్మానాగరాజ్, ప్రముఖ కార్టూనిస్ట్, కవి, గాయకులు జి.యస్.ఆర్., మానస అధ్యక్షులు బండారుపల్లి రామచంద్రరావు, సత్కార గ్రహీతలు సభలో ప్రసంగించారు. సభా కార్యక్రమానికి ముందు సినీగీత విభావరి అందరినీ అలరించింది. ఈ సినీవిభావరి కార్యక్రమంలో రుక్మిణ, హరి విమల, సుబ్బిరెడ్డి, విజయ, జి.యస్.ఆర్., శోభన్ బాబు, శ్రీ రామమూర్తి, అరుణ పాల్గొన్నారు. మానస కార్యదర్శి రఘుశ్రీ సభాసమన్వయం గావించారు.

### బిఆర్ఎస్ రాజకీయ వ్యభిచారిలా మారింది

### మెట్టు సాయి కుమార్ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్...



హైద్రాబాద్ ఏప్రిల్ 4 ; బిఆర్ఎస్ రాజకీయ వ్యభిచారిలా మారిందనిఫిషరీస్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ విమర్శించారు. ఇబ్రహీంపట్న ంలో బీజేపీతో పొత్తు పెట్టుకుని గెలిచిందిబిఆర్ఎస్ చైర్మన్,బీజేపీ వైస్ ఛైర్మన్ అయ్యారులిక్యాతనపల్లిలో బిఆర్ఎస్ దౌర్జన్యాలకు పాల్పడి సీపీఐ పార్టీ మద్దతు ఇస్తే గెలిచిందికేటీఆర్ రాష్ట్రంలో అనైతిక రాజకీయాలు చేస్తున్నారు2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ,బిఆర్ఎస్ ఒక్కటి అయ్యాయిగ్రామ పంచాయతీ,మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్,బీజేపీ కలిసి పని చేశాయిబిఆర్ఎస్,బీజేపీ కుమ్మక్కు రాజకీయాలను తెలంగాణ ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

# శంషాబాద్ - షాబాద్ రోడ్డు విస్తరణకు తొలగిన అడ్డంకులు






- **శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ వరకు ఫుట్ పాత్, రోడ్డు ఆక్రమణలను తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులు**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 4 (నగరనిజం ప్రతినిధి):** గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ లోని శంషాబాద్ లో రోడ్డు, ఫుట్ పాత్ స్థలాల ఆక్రమణలపై "నగర నిజం" దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.ఆక్రమణల జోలికి వెళ్ళని అధికారులు... ముందుకు సాగని విస్తరణ పనులు అనే శీర్షికతో నగర నిజం దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన ప్రత్యేక కథనానికి స్పందించిన జీహెచ్ఎంసీ అధికార యంత్రాంగం.... ఉక్కు పాదంతో ఆక్రమణలను కూల్చివేశారు. దీంతో శంషాబాద్ - షాబాద్ రోడ్డు విస్తరణకు అడ్డంకులు తొలగిపోయినట్లయింది. అధికారులు ఆక్రమణలను కూల్చి వేసిన నేపథ్యంలో త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు మొదలు కాబోతున్నాయి. రంగారెడ్డి జిల్లా లోని శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ మీదుగా షాబాద్ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 100 ఫీట్ల వెడల్పుతో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ రోడ్డు, ఫుట్ పాత్ స్థలాల ఆక్రమణల కారణంగా విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. ఆర్టీసీ బస్టాండ్ నుండి నర్కూడ వరకు చాలా చోట్ల రోడ్డు, ఫుట్ పాత్ స్థలాలను ఆక్రమించుకొని తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తున్న కొందరు వాటిని అద్దెకిచ్చి రెండు చేతులా సంపాదిస్తున్నారు. రోడ్డు పక్కన ఫుట్ పాత్ స్థలాల్లో పండ్లు, టీ స్టాల్స్, టిఫిన్ సెంటర్లు, పాన్ షాపులు, కూరగాయలు, మటన్ షాపులు ఇలా తాత్కాలిక దుకాణాలను నెలకొల్పుతున్న కొందరు.... ఒక్కో దుకాణం నుండి నెలకు 10 వేల నుండి 15 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు వ్యాపారస్తులయితే రోడ్డు పక్కన ఉన్న తమ కమర్షియల్ స్థలం మొత్తం లో భవనాలు నిర్మించుకోవడమే కాకుండా రోడ్డు నుండి ఫుట్ పాత్ స్థలాలను ఆక్రమించుకొని ర్యాంపులు, మెట్లు నిర్మించుకున్నారు. ఆ తర్వాత తమ వ్యాపారం సముదాయాల ఎదురుగా తాత్కాలికంగా చిరు వ్యాపారస్తులను అనుమతిస్తూ వారి నుండి నెలకు అద్దె వసూలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. దీంతో శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ రోడ్డు పక్కన వెలసిన ఆక్రమణలను తొలగించడం అధికారులకు తలనొప్పిగా మారింది. ఆక్రమణలను తొలగించకపోవడంతో మూడేళ్లుగా రోడ్డు విస్తరణ పనులు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతూ వస్తున్నాయి. మరోవైపు శంషాబాద్ వద్ద రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. శంషాబాద్ తో పాటు పరిసర గ్రామాల్లో జనాభా సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దీనికి తోడు షాబాద్ సమీపంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కావడంతో శంషాబాద్ - షాబాద్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పద్మ వ్యూహాన్ని తలపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆక్రమణల కారణంగా రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగకపోతుండడంతో ఇరుకు రోడ్డులో వాహనదారులు నిత్యం నరకాన్ని చవిస్తున్నారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ - రాళ్లగూడ రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగక పోతున్న వైనంపై ఆక్రమణల జోలికి వెళ్ళని అధికారులు.... ముందుకు సాగని విస్తరణ పనులు అనే పతాక శీర్షికతో మార్చి 28న నగర నిజం దినపత్రికలో ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగరనిజం దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన శంషాబాద్ జోన్ జీహెచ్ఎంసీ అధికార యంత్రాంగం.... శనివారం నాడు ఆక్రమణలపై ఉక్కు పాదం మోపింది. శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ స్థలాలను ఆక్రమించుకొని చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. దీంతో శంషాబాద్ - షాబాద్ రోడ్డు విస్తరణ పనులకు అడ్డంకులు తొలగిపోయినట్లయింది. రోడ్డు విస్తరణ పూర్తయితే శంషాబాద్ - షాబాద్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే తెరపడనుంది.

**నగర నిజం ఎఫెక్ట్....**

### ఆక్రమణల తొలగింపు పై శంషాబాద్ వాసుల హర్షం

రోడ్డు విస్తరణకు అడ్డంకి గా మారిన ఫుట్ పాత్ స్థలాల ఆక్రమణలను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చి వేయడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది. రోడ్డు విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తీరిపోతాయని ప్రజలు భావిస్తున్నారు.





# రోడ్డు విస్తరణకు అందరూ సహకరించాలి

- **బండి గోపాల్ యాదవ్**
- **నర్కూడ నుండి వచ్చే వాహనదారులంతా సిద్దులగుట రోడ్డును ఉపయోగించుకోవాలని బండి గోపాల్ యాదవ్ విజ్ఞప్తి**
- **అందరి సహకారంతోనే రోడ్డు విస్తరణ సాధ్యమన్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్**





**రాజేంద్రనగర్, ఏప్రిల్ 4 (నగరనిజం ప్రతినిధి):** శంషాబాద్ - షాబాద్ రోడ్డు విస్తరణ నేపథ్యంలో ప్రజలంతా విస్తరణకు సహకరించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. నర్కూడ గ్రామం నుండి శంషాబాద్ కు వచ్చే వాహనదారులంతా రాళ్లగూడ నుండి సిద్దలగుట్ట వెళ్లే రోడ్డు మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు వైపు ప్రయాణించాలని బండి గోపాల్ యాదవ్ సూచించారు. శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ మీదుగా గల రోడ్డును 100 అడుగుల వెడల్పుతో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులు ఇప్పటికే మొదలైనప్పటికీ అక్కడక్కడ రోడ్డు ఫుట్ పాత్ స్థలాల ఆక్రమణల కారణంగా విస్తరణ పనులు ఆలస్యం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం నాడు జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశాల మేరకు శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ, డిప్యూటీ కమీషనర్ సుమన్ రావు సారథ్యంలో శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను అధికారులు కూల్చివేశారు. ఈ నేపథ్యంలో త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు మొదలుకానున్నాయి. అయితే రోడ్డు విస్తరణ పనులు మొదలవుతున్న నేపథ్యంలో నర్కూడ నుండి రాళ్లగూడ మీదుగా శంషాబాద్ వైపు వచ్చే వాహనదారులంతా రోడ్డు విస్తరణకు సహకరించాలని శంషాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వాహనదారులంతా రాళ్లగూడ నుండి సిద్దులగుట్ట ఆలయానికి వెళ్లే మార్గాన్ని ఉపయోగించుకుంటూ శంషాబాద్ చేరుకోవాలని ఆయన సూచించారు. ప్రజలంతా సహకరిస్తేనే రోడ్డు విస్తరణ వెంటనే పూర్తవుతాయని, తద్వారా ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని బండి గోపాల్ యాదవ్ అభిప్రాయపడ్డారు. శంషాబాద్ ప్రజలంతా అధికారులకు సహకరిస్తే రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పులోతప్పేమిటి?

న్యూ డిల్లి ఏప్రిల్ 4, పార్లమెంట్ లో నక్సలిజంపైన మాట్లాడుతూ హోంశాఖ మంత్రి, సుప్రీం కోర్టు జస్టిస్ సుదర్శన్ రెడ్డి పైన తీవ్ర ఆరోపణలు చేశారు. చత్తీస్గఢ్ లో సాల్వాజుడుం ను రద్దుచేయక పోయివుంటే నక్సలిజం ఎప్పుడో అంతమయ్యేదన్నదన్నారు. రాజ్యాంగ బద్ధంగా పరిశీలిస్తే, నాయకులు పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో పదేపదే ఉచ్చరించే భాషలో ప్రైవేట్ వ్యక్తులు ఆయుధాలు కలిగి ఉండరాదు, హింసకు పాల్పడరాదని కదా. చట్టపరిధిలోనే న్యాయంకోసం పోరాడాలని పదేపదే ఉచ్ఛరిస్తున్నారు కూడా. అలాంటప్పుడు చట్ట వ్యతిరేకంగా హింసను కొనసాగిస్తున్న సాల్వాజుడుంను రద్దు చేయాలని ప్రజాస్వామిక వాదులు సుప్రీం కోర్టులో పిల్ వేశారు. దీనిని సుదీర్ఘంగా పరిశీలించిన సుప్రీం కోర్టు బెంచ్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు, సాల్వాజుడుం చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆధారాలను పరిశీలించి రద్దు చేయాలని తీర్పును ఇచ్చారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని ఇచ్చిన తీర్పు ఇది. దీన్ని పౌరసమాజం స్వాగతించింది. సాల్వాజుడుం ను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ తీర్పును అమలు చేసింది. దీనిలో న్యాయమూర్తిని గాని, బెంచినిగాని అభిశంసిం చాల్సిన అంశం ఏదీ లేదు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారితో కూడిన బెంచి ఇచ్చినతీర్పును తప్పుపట్టడం చాలా విచారకరం. దీనితో పాటు ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ తోపాటు, మిగిలిన కాంగ్రెస్ నాయకులను కూడా తీవ్రంగానే విమర్శించారు. నాయమూర్తులు, ప్రజాస్వామిక వాదులు, బుద్ధిజీవులు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ కీలకఅంశంపై నోరుమెదపకుండా మిన్నకుండి పోయారు.పోరాసమాజం నుండి రాజకీయ పార్టీలనుండి కూడా ఎలాంటి స్పందన కానరాలేదు. రాజ్యంగ పరిరక్షణ కోసం, చట్టం సక్రమంగా అమలుజరగాలనే ఆకాంక్షతో, ప్రజాస్వామిక విలువల పరిరక్షణకు కట్టుబడి ఇచ్చిన తీర్పుపైన ఎవరూ మాట్లాడక పోవడాన్ని ఎలా అర్ధం చేసుకోవాలి. ప్రశ్నించే గొంతులు మూగబోతే దేశ భవిష్యత్ ఏమిటి? అన్నది ప్రస్తుతం పౌరసమాజం ముందున్న/ ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్! .

నగరనిజం
5 ఆదివారం, ఏప్రిల్ 2026

# భవనాలకు నష్టం వాటిల్లకుండా రోడ్డు విస్తరణ చేపట్టండి





- శంషాబాద్ జోనల్ కమీషనర్ కు స్థానిక నేతల విజ్ఞప్తి
- భవన యజమానులకు నష్టం కలగకుండా రోడ్డు విస్తరిస్తే విస్తరణకు సహకరిస్తామన్న నాయకులు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 4 (నగరనిజం ప్రతినిధి):** గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధి శంషాబాద్ లోని ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ రోడ్డులో భవన యజమానులకు నష్టం వాటిల్లకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలని పలువురు స్థానిక నాయకులు శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళకు విజ్ఞప్తి చేశారు. భవన యజమానులకు నష్టం వాటిల్లకుండా రోడ్డు విస్తరణ చేపడితే అందుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని వారు కమీషనర్ కు హామీ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ మీదుగా షాబాద్ వరకు తలపెట్టిన రోడ్డు విస్తరణ నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన పలు ఆక్రమణలను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. ఫుట్ పాత్ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్ల రోడ్డు విస్తరణ పనులకు అవరోధంగా పరిణమించింది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశాల మేరకు హైదరాబాద్ తో పాటు శివారు ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమణలను అధికారులు తొలగించారు. ఈ మేరకు శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను కూల్చివేశారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ మాజీ సర్పంచ్ ఆర్ గణేష్ గుప్తా, శంషాబాద్ సహకార బ్యాంకు మాజీ చైర్మన్ కొలను మహేందర్ రెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు మేకల వెంకటేష్ ముదిరాజ్, చేవెళ్ల కవితా ప్రసాద్, మాజీ ఎంపీటీసీ జ్ఞానేశ్వర్ యాదవ్, స్థానిక నేతలు ఆవుల శ్రవణ్ కుమార్, నాగేష్ యాదవ్, రాచమల్ల కిషోర్ కుమార్ తదితరులు శనివారం నాడు శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి రాళ్లగూడ వరకు రోడ్డు విస్తరణ చేపడుతున్న నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవన యజమానులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని వారు కమీషనర్ చంద్రకళకు విజ్ఞప్తి చేశారు. భవన యజమానులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా రోడ్డు విస్తరణంగా చేపడితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, రోడ్డు విస్తరణకు తాము సహకరిస్తామని వారు కమీషనర్ కు భరోసా ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కమీషనర్ చంద్రకళ స్థానిక నాయకులకు హామీ ఇచ్చారు.



# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో పాల్గొన్న తుంబూరు దయాకర్ రెడ్డి



**ఖమ్మం: ( నగర నిజం బ్యూరో) ఏప్రిల్ 4:** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ 31 వ వార్డు కి చెందిన దండి రామారావు దంపతులకి ప్రజా ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి నూతన వస్త్రాలు బహుకరించి అభినందనలు తెలిపినారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రజలు నమ్మి ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వం ప్రజల ఆశలు నెరవేరుస్తూ సామాన్య ప్రజల సొంతింటి కలలు నెరవేరుస్తుంది అని దానికి ఈ గృహప్రవేశమే ఉదాహరణ అని అన్నారు. ఈ కార్యక్రమం లో వారితో పాటు ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పోకబత్తిన అనిత ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు నూకల రామ్మోహన్ రెడ్డి, భూక్యా సురేష్ నాయక్, పాలేరు నియోజకవర్గ ఆత్మా కమిటీ డైరెక్టర్ ఎన్.పి.చారీ,మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు వెంపటి సురేష్, పొన్నేకంటి నరసింహ రావు, ఏపూరి తరుణ్,కళ్లెం శేషి రెడ్డి,భద్రా చారీ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి కుమారుడి వివాహ రిసెప్షన్

- వేడుకకు ముస్తాబైన ఖమ్మం వైయస్సార్ కాలనీ



**ఖమ్మం :(నగర నిజం బ్యూరో)ఏప్రిల్4:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క – నందిని దంపతుల ప్రథమ కుమారుడు చి. సూర్య విక్రమాదిత్య, చి.ల.సౌ. సాక్షి ల వివాహ రిసెప్షన్ వేడుకకు ఖమ్మం నగరం ముస్తాబైంది. ఆదివారం (ఏప్రిల్ 5న) ఖమ్మంలోని గ్రీన్ హిల్స్, వైఎస్ఆర్ కాలనీ రోడ్ నందు ఉదయం 10 గంటల నుండి ఈ వేడుక అత్యంత వైభవంగా జరగనుంది. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు మరియు మధిర నియోజకవర్గ ఓటర్ల కోసం డిప్యూటీ సీఎం ఈ ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. తమ అభిమాన నాయకుడి కుటుంబ వేడుకను పండుగలా నిర్వహించేందుకు పార్టీ కార్యకర్తలు ఇప్పటికే భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది.

### రిసెప్షన్ వేడుకకు భారీ ఏర్పాట్లు

ఈ రిసెప్షన్ వేడుకకు సుమారు లక్ష మందికి పైగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగానే భోజన వసతులు, పార్కింగ్ మరియు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. వచ్చే అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేదిక వద్ద అన్ని సౌకర్యాలు కల్పించారు.

### ?వధూవరులను ఆశీర్వదించాలని విన్నపం:

గత నెల మార్చి 5న హైదరాబాద్‌లో వివాహం జరిగిన నేపథ్యంలో, స్థానిక ప్రజల ఆశీస్సుల కోసం ఈ కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహిస్తున్నారు. “మా కుటుంబ వేడుకకు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు మరియు నియోజకవర్గ ప్రజలందరూ విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించి, విందును స్వీకరించి మా ఆనందాన్ని పంచుకోవాలి” అని భట్టి విక్రమార్క నందిని దంపతులు సాదరంగా ఆహ్వానిస్తున్నారు.

# ఓటమిని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ కార్యకర్తల దాడులు

- బీఆర్ఎస్ నేత కొలను ప్రదీప్ రెడ్డి
- కేసీఆర్ క్యాంప్ కార్యాలయం పై దాడికి పాల్పడ్డ నిందితులను అరెస్టు చేయాలని ప్రదీప్ రెడ్డి డిమాండ్
- నిందితులను అరెస్టు చేయకపోతే ఆందోళన తప్పదని హెచ్చరిక



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 4 (నగరనిజం ప్రతినిధి):** శనివారం నాడు తెలంగాణలోని పలు జిల్లాల్లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ కార్యకర్తలు కేసీఆర్ క్యాంపు కార్యాలయం పై దాడికి పాల్పడ్డారని బీఆర్ఎస్ పార్టీ శంషాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటూ కాంగ్రెస్ కార్యకర్తలు భౌతిక దాడులకు దిగుతున్నారని ఆయన విమర్శించారు. గజ్వేల్ లోని కేసీఆర్ అధికారిక క్యాంపు కార్యాలయం పై శనివారం నాడు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు పాల్పడడాన్ని బీఆర్ఎస్ పార్టీ శంషాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొలను ప్రదీప్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం నాడు జరిగిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికతో పాటు క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారని ప్రదీప్ రెడ్డి గుర్తు చేశారు. అయితే మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయాన్ని తట్టుకోలేకనే కాంగ్రెస్ కార్యకర్తలు కేసీఆర్ కార్యాలయం పై దాడులకు పాల్పడ్డారని ప్రదీప్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ గూండాలు జరిపే దాడులకు భయపడే ప్రసక్తే లేదని ప్రదీప్ రెడ్డి తేల్చి చెప్పారు. సాక్షాత్తు ఒక మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడుల పాల్పడుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆయన విమర్శించారు. కేసీఆర్ క్యాంపు కార్యాలయం పై దాడులకు పాల్పడ్డ నిందితులు ఎంతటి వారైనా సరే తక్షణమే అరెస్టు చేసి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రదీప్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కోట్ల వెంకట జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

- 25 సంవత్సరాలుగా కోట్ల రాందేవ్ రెడ్డి సామాజిక కార్యక్రమాలు




**ఏప్రిల్ 4,(నగరనిజం ప్రతినిధి)**మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోపన్ పల్లి గ్రామానికి చెందిన కోట్ల వెంకట జాగృతి ఫౌండేషన్ నిర్వాహకులు రాందేవ్ రెడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ 100 మంది విద్యార్థులకు శనివారం రోజు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా కోట్ల భగవంత్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్,సేవా భారతి జిల్లా అధ్యక్షుడు రాందేవ్ రెడ్డి మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి కోట్ల భగవంత్ రెడ్డి సేవా సమితి పేరుతో విద్య,వైద్యం,ఉపాధి రంగాల్లో సామాజిక కార్యక్రమాలను చేయడం జరిగిందన్నారు.భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేస్తామన్నారు.గోపన్ పల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాధ రాందేవ్ రెడ్డి,ఫౌండేషన్ సెక్రెటరీ చందన,గ్రామ సర్పంచ్ కోమరి బాల్ రాజ్,పాఠశాల ఉపాధ్యాయులు అబ్దుల్ హక్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు,వల్లభ్ రెడ్డి,వార్డు మెంబెర్స్ కుమ్మరి బుచ్చన్న,ఉప్పరి రమేష్,వడ్డే ప్రసాద్ పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఏసుక్రీస్తు సిలువ యాగంతోనే మానవాళికి పాప విముక్తి

- ఐసీపీసీ చైర్మన్ రెవరెండ్ పాస్టర్ కె.దినాకర్
- యాచారం మండలంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 ( నగరనిజం ) :** ఏసుక్రీస్తు సిలువ యాగంతోనే మానవాళికి పాప విముక్తి కలిగిందని ఇబ్రహీంపట్నం ఐసీపీసీ చైర్మన్ రెవరెండ్ పాస్టర్ కె.దినాకర్ అన్నారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శనివారం యాచారం మండల కేంద్రంలో యాచారం మండల పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్ సంజీవ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. సాయి శరణం గార్డెన్ నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ రన్ ఫర్ జీసస్ ర్యాలీకి ఐసీపీసీ చైర్మన్ రెవరెండ్ పాస్టర్ కె.దినాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ఎంతో అద్భుతంగా జరుపుకుంటున్న గుడ్ ఫ్రైడే ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటల ద్వారా క్షమాగుణం, బాధ్యత, ప్రేమ, పాపపుఒప్పుకోలు, దయాగుణాలు అలవర్చుకోవాలని తెలిపారు. పాపుల కోసమే ఏసుక్రీస్తు జన్మించి సిలువలో రక్తం చిందించి ప్రాణాలర్పించినట్లు తెలిపారు. పాపపు జీవితాన్ని వదిలి క్రీస్తు చూపిన మార్గంలో నడిచిన పరలోకం చేరాలని బోధించారు. ఏసుక్రీస్తు మానవాళిలై చూపిన ప్రేమ, త్యాగము, అందరూ గ్రహించి సాటి మనుషులను కూడా అలాగే ప్రేమతో చూడాలన్నారు. ఏసుక్రీస్తు మానవాళి రక్షణ కొరకు సిలువపై తన విలువైన రక్తము చిందించి పరమాపదించిన రోజునే ప్రపంచమంతా గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటమన్నారు. దైవ కుమారుడు, కరుణామయుడు, ఏసుక్రీస్తు మానవాళి పాపాల నుంచి విముక్తి చేయబడ్డదానికి త్యాగానికి ప్రతీక ఏసుక్రీస్తు అని కొనియాడారు. ఏసుక్రీస్తు సిలువ త్యాగాన్ని గుర్తు చేసుకోవడమే గుడ్ ఫ్రైడే అని అన్నారు. ఆయన త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యాచారం సర్పంచ్ మస్కు అనిత శరణం, క్రిస్టియన్ కోఆర్డినేటర్లు చెరుకూరి రాజు, విక్టర్ సన్నుత్, ఐసీపీసీ సెక్రటరీ దేవకూమార్, ఇబ్రహీంపట్నం మండల చైర్మన్ రెవరెండ్ కరుణాకర్, యాచారం పాస్టర్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఇమ్మానుయేలు, కార్యదర్శి భాస్కర్, సహాయ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కోశాధికారి ప్రభాకర్, సభ్యులు దానియేలు, ఇర్మియా, సామ్యూల్, మంచాల మండల వైస్ చైర్మన్ శ్రీనివాస్, సలహా దారులు ఆశీర్వాదం, జోసెఫ్, జాన్ సన్, క్రైస్తవ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.



Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE